సాక్షి
వికారాబాద్

ఆదివారం । 4 । మే । 2025



‘పట్టా’లేని పాట్లు!

కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. 8లో▸



వరిధాన్యం సేకరణకు..

జిల్లాలో వరి ధాన్యం సేకరణకు అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. 8లో▸



రోడ్డు విస్తరణకు..

మర్పల్లిలో రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ కోరారు. 9లో▸

న్యూస్‌రీల్

ధారూరు మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 5,334 బస్తాల 1010 రకం వడ్లు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాలుకు రూ.1,940 నుంచి రూ.2 వేల వరకు ధర పలికినట్లు చెప్పారు. మొక్కజొన్న 1,787 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,225 నుంచి రూ.2,340 వరకు, సోనారకం వడ్లు 165 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,250 నుంచి రూ.2,230 వరకు, కందులు 97 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.6,150 నుంచి రూ.7,050 వరకు ధర పలికిందని ఆమె వివరించారు. అలాగే పసుపులో కాడి రకం 59 బస్తాల వచ్చాయని, క్వింటాలుకు రూ.8,900 నుంచి రూ.12 వేల వరకు, పసుపులో గుండు రకం 10బస్తాలు రాగా క్వింటాలుకు రూ.11,500 వేల నుంచి రూ.12,200 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె తెలిపారు.

నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం జరగనున్న పరీక్షకు భద్రత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,193 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల వద్ద గల జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

రేపటి నుంచి 13 వరకు తొమ్మిది బృందాల పర్యటన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల ఐదు నుంచి 13 వరకు తొమ్మిది బృందాలు, 54 గ్రామాల్లో పర్యటించి సహజ వనరులు, పంట మార్పిడి, చెట్ల పెంపకం, సాగునీటి యాజమాన్యం, విత్తనాలు, రసాయనాల కొనుగోలు చేసిన రసీదులను భద్రపరుచుకోవడం వల్లే చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు సహజ వనరుల విభాగం సంచాలకురాలు డాక్టర్ కేపీ వాణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని మొయినాబాద్, కొత్తూరు, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం మండలాల్లోని రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్వే షురూ..



మీరాఖాన్‌పేట రెవెన్యూలో ప్రారంభమైన సర్వే

కందుకూరు: ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం సేకరించి పరిహారం చెల్లించిన భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు శనివారం సర్వే పనులు ప్రారంభించారు. మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, పంజుగూడ రెవెన్యూలో గతంలో సేకరించిన భూములను సర్వేచేసి వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయనున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఫ్యూచర్‌సిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజుతో పాటు కందుకూరు సీఐ సీతారామ్, పహడీషరీఫ్ డీఐ జితేందర్‌రెడ్డి పర్యవేక్షణలో నలుగురు ఎస్‌ఐలు, 60 మంది పోలీసు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ విషయంలో రైతులకు ఇబ్బందులు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, అందుకు తాము సహకరిస్తామని సీఐ కృష్ణంరాజు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు

మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

మొయినాబాద్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తున్నాయని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షురాలిగా చిలుకూరు మాజీ సర్పంచ్ గునుగుర్తి స్వరూపకు నియామకపత్రం అందజేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

బినామీ దందా!

- రంగారెడ్డి జిల్లాలోని ఓ డీసీఎంఎస్ దుకాణ సముదాయం పట్టర్ల కేటాయింపులో రూ.6 లక్షల డిపాజిట్, నెలకు రూ.6 వేల అద్దె చెల్లిస్తామని ఓ వ్యక్తి ముందుకొచ్చారు. పాలకవర్గం, అధికారులు దీన్ని తిరస్కరించి, ఎలాంటి ఓపెన్ ఆక్షన్ లేకుండా రూ.లక్ష డిపాజిట్, నెలకు రూ.3 వేల అద్దె చొప్పున తమ బినామీలకు కట్టబెట్టారు.
- వికారాబాద్ జిల్లా తాండూరు, పరిగి రైస్ మిల్లుల కేటాయింపుల్లో పాలకవర్గం అధ్యక్షుడు, బిజినెస్ మేనేజర్లకు అనుకూలమైన వ్యక్తులకు లీజుకు ఇచ్చారని, వారి నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి, రూ.7 లక్షలు సంఘానికి చెల్లించి, రూ.3 లక్షలు పంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా డీసీఎంఎస్‌కు రూ.24 లక్షల మేర నష్టం జరిగింది.
- శంకర్‌పల్లి, చేవెళ్ల, పాలమాకుల, మేడ్చల్ సంఘాల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణ సముదాయాల నిర్మాణ పనులను తమ వారిని కట్టబెట్టారు. కేటాయింపుల్లోనూ బినామీ పేర్లతో వారి అనుకూల వర్గాలకే అప్పగించారు. అనంతరం మూడో వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. ప్రస్తుతం చిన్న వర్షానికే దుకాణాలు కురుస్తున్నాయని వ్యాపారులు ఫిర్యాదు చేశారు.
- ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా సిబ్బందికి మూడు దఫాలుగా వేతనాలు పెంచారు. ఆరు నెలల ముందే పెంచినట్లు లెక్కలు చూపి, ఈకాలానికి సంబంధించిన సుమారు రూ.50 లక్షలు పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. గతేడాది ఆగస్టు 14న జరిగిన పాలకవర్గ సమావేశంలో బోనస్ ఇవ్వడం కుదరని తేల్చి చెప్పారు. కానీ బిజినెస్ మేనేజర్ బోనస్ విడుదల చేశారని తెలుస్తోంది.
- వికారాబాద్ జిల్లాలోని 30 డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాల పేర్లపై ఎరువులు, విత్తనాల విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి, ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నారని, అందులో రూ.లక్ష డీసీఎంఎస్‌కు చెల్లించి, రూ.50 వేలు పాలకవర్గం, బిజినెస్ మేనేజర్లు పంచుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

డీసీఎంఎస్‌లలో అక్రమాల తిష్ట

- బినామీ పేర్లతో దుకాణాల దందా
- జోరుగా అనధికారిక నిర్మాణాలు
- అమ్మకానికి తాండూరు కంది మిల్లు, పరిగి విత్తన శుద్ధి కేంద్రం
- రైస్ మిల్లుల కేటాయింపుల్లోనూ అవినీతి
- పాలకవర్గం, బిజినెస్ మేనేజర్ల తీరుపై ఆరోపణలు



డీసీఎంఎస్ వికారాబాద్ శాఖ కార్యాలయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా సహకార మార్కెటింగ్ సంఘంలో పాలకవర్గం సభ్యులు, అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. సంఘానికి వచ్చే ఆదాయ మార్గాలను పక్కన పెట్టి వ్యక్తిగత లాభాపేక్షకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణ సముదాయాలు నిర్మించడం, వాటిని బినామీ పేర్లతో సొంతం చేసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో సంఘానికి రూ.కోట్లల్లో నష్టం జరుగుతోందని పాలకవర్గ సభ్యులే ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

ఎక్కడ చూసినా..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ పరిధిలోని వికారాబాద్, తాండూరు, పరిగి, శంకర్‌పల్లి, చేవెళ్ల, పాలమాకుల, మేడ్చల్ ఇలా ఎక్కడ చూసినా అక్రమాలే కనిపిస్తున్నాయి. దుకాణాల కేటాయింపుల్లో అధిక మొత్తంలో డిపాజిట్, అద్దె చెల్లించే వారికి అప్పగించాల్సి ఉన్నా, బినామీ పేర్లతో దుకాణాలు సొంతం చేసుకుంటున్నారు. వీటిని అధిక అద్దెకు మూడో వ్యక్తికి కట్టబెడుతున్నారు. దీంతో సంఘాలకు డిపాజిట్, అద్దె రూపంలో రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. తాండూరులో 30 ఏళ్ల క్రితం పప్పు మిల్లు, పరిగిలో 25 ఏళ్ల క్రితం విత్తన శుద్ధి ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ రెండూ గతంలో మంచిలాభాలు ఆర్జించాయి. కొంతకాలంగా వీటిని ఆపేశారు. తాజాగా ఎలాంటి అనుమతులు లేకుండానే వీటి అమ్మకానికి తీర్మానాలు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరు, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల గిడ్డంగుల అమ్మకానికి సిద్ధమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో ప్రభుత్వ అధికారులు నిర్వహించే సెంటర్లను ప్రస్తుతం కమిషన్ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వీరు తరుగు పేరుతో రైతులకు 4నుంచి 6 కేజీల నష్టం చేస్తున్నారని, సంఘానికి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నామని సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో కొడంగల్ కందుల కొనుగోలు కేసులో ఉన్న వ్యక్తులు తాజాగా ఈ అక్రమాల్లో సూత్రధారులుగా ఉన్నారని సమాచారం.

విచారణ చేపడతాం

దుకాణాల కేటాయింపుల్లో అక్రమాలపై ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. సంస్థ ఆస్తులు అమ్మకాలకు సంబంధించి తీర్మానాలు చేసినా, ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు రాకపోతే అది వీలు పడదు.

– సుధాకర్, జిల్లా సహకార శాఖ అధికారి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కమిషనర్ సృజన, కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఉద్యాన పంటలకు ఊతం

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన, కలెక్టర్ ప్రతీక్‌జైన్
- చీమల్‌దరి గ్రామంలో పర్యటన

మోమిన్‌పేట: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన తెలిపారు. శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి మండలంలోని చీమల్‌దరి గ్రా మంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపా ధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులు, వేతనంపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన తోటలు మామిడి, జామ, మునగ, సీతాఫలం తదితర పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. మూడు సంవత్సరాల పాటు తోటల పెంపకానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. పొలాల్లో ఏటవాలుకు అడ్డంగా చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచి వర్షాకాలంలో నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని కంపోస్టు షెడ్డు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, శంకర్, ఈసీ వికాస్, కార్యదర్శులు భరత్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

నవాబుపేట: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన వన పంటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన ఆదేశించారు. శనివారం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలాల వద్ద చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, పంచాయత్ రాజ్ ఈఈ ఉమేష్, డీఈ మాధవరెడ్డి, ఎంపీడీవో అనురాధ, ఏపీఓ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు గీత, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

భూ భారతితో రైతులకు మేలు

కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకవచ్చిన భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కొత్త చట్టంపై రైతులకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ ద్వారా చాలా సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు. తాను జిల్లాలో బాధ్యతలు చేపట్టే నాటికి 15 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవాని, వాటిని 5 వేలకు తెచ్చినట్లు వివరించారు. భూ భారతి చట్టంతో జిల్లాలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి మండలానికి 5 నుంచి 6 మంది వరకు సర్వేయర్లను నియమించడం జరుగుతుందన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే

అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. భూమికి రైతుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. భూమి ఉన్నంత కాలం రైతు ఉంటాడని పేర్కొన్నారు. భూమినే నమ్ముకొని బతుకుతున్న రైతులకు అధికారులు మేలు చేయాలని సూచించారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. అన్నదాతల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ సంఘం నాయకుడు మాణిక్‌రెడ్డి, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ జైరాం, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి జ్యోతి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల బాలకేంద్రం

- మౌలిక వసతులు లేక చిన్నారుల పాట్లు
- ప్రహరీ లేక ఇబ్బందులు
- శిథిలావస్థలో భవనం



బాలకేంద్రంలో పూర్తిగా పాడైన కిటికీలు

అనంతగిరి: చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన బాలకేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వేసవి సెలవుల్లో పిల్లలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు 1982లో వికారాబాద్‌లో బాలకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదు గదుల్లో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్యాలయ గది గోడకు పగుళ్లు వచ్చాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కిటికీలు, తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం వస్తే గదుల్లోకి నీరు చేరుతోంది. ఏళ్ల తరబడిగా భవనం మరమ్మతులకు నోచుకోవడం లేదు. కేంద్ర చుట్టూ గడ్డి ఏపుగా పెరిగి విషపురుగులకు నిలయంగా మారింది. ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం బాల కేంద్రంలో సమ్మర్ క్యాంపు మొదలైంది. గత నెల 26 నుంచి చిన్నారులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు భరతనాట్యం, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, తబలా, బుక్ రీడింగ్ తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 200లకు పైగా పిల్లలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇక్కడ శిక్షణ ఇవ్వడానికి అనుభవజ్ఞులైన సిబ్బంది ఉంది. వేసవి శిబిరం కావడంతో చిన్నారులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. అయితే సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న గదులు సరిపోక వరండాలో భరత నాట్యం నేర్పుతున్నారు.



నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు

రాణిస్తున్న చిన్నారులు

ఇక్కడ శిక్షణ పొందుతున్న చిన్నారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. ఎక్కడైనా ప్రదర్శనలు ఇవ్వాల్సి వస్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని చిన్నారులు తెలిపారు. సొంతంగా డబ్బు సమకూర్చుకొని వెళ్లాల్సి వస్తోందని వివరించారు. కలెక్టరేట్‌లో జరిగే వివిధ ఉత్సవాల్లో సైతం బాలకేంద్రం చిన్నారులకు అవకాశాలు ఇవ్వాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని బాలకేంద్రంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, భవనానికి మరమ్మతులు చేయాలని వారు విన్నవించారు.

పెండింగ్‌లోనే అప్‌గ్రేడ్ ఫైల్

వికారాబాద్‌లోని బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేస్తే పిల్లలకు మరిన్ని కళలు అందుబాటులోకి వస్తాయి. ఇందుకు సంబంధించిన ఫైల్ డైరెక్టరేట్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. స్పీకర్ ప్రత్యేక చొరవ తీసుకుని బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘ఎర్లీబర్డ్’కు స్పందన కరువు

- ఐదు శాతం రాయితీ ప్రకటించినా ముందుకు రాని మున్సిపల్ వాసులు
- షాద్‌నగర్‌లో 27 శాతం, కొత్తూరులో 14 శాతం చెల్లింపులు
- ఈ నెల 7వ తేదీ వరకు గడువు పెంపు

షాద్‌నగర్: మున్సిపాలిటీల్లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ఎలాంటి బకాయిలు లేని వారు ముందస్తుగా మొత్తం పన్ను చెల్లిస్తే అందులో ఐదు శాతం రాయితీని కల్పిస్తోంది. కానీ మందస్తు చెల్లింపులకు ఇళ్ల యజమానుల నుంచి స్పందన అంతంతమాత్రమే వచ్చింది.

షాద్‌నగర్‌లో రూ.1.94 కోట్ల వసూలు

షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డుల్లో సుమారు 70వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. 15,933 గృహ, వ్యాపార సముదాయాల నుంచి సుమారుగా రూ.7.22 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు సుమారు 27శాతం రూ.1.94 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి.

కొత్తూరులోనూ అంతంతే..

కొత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 13,200 జనాభా ఉంది. 2,619 ఇళ్లు, వ్యాపార సముదాయాలున్నాయి. వీటి నుంచి రూ.2.56 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఎర్లీ బర్డ్ పథకంలో అధికారులు ఇప్పటి వరకు సుమారు 14శాతంతో రూ.54 లక్షలు వసూలు చేయగలిగారు.

ప్రచారం నిర్వహించినా స్పందన కరువు

ఎర్లీ బర్డ్ పథకం పై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక బృందాలుగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అగాహన కల్పించారు. మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాలకు మైకులను ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. అయినప్పటికీ ఆశించిన మేర పన్నులు వసూలు కాలేదు. ప్రభుత్వం విధించిన గడువును ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు.



షాద్‌నగర్‌లో ముందస్తు పన్ను చెల్లించిన ఇంటి యజమానిని సన్మానించిన అధికారులు (ఫైల్)

రాయితీ గడువు పెంపు

ఎర్లీ బర్డ్ పథకానికి ఏప్రిల్ 30తో గడువు ముగిసింది. అయితే ప్రభుత్వం ఈ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లోగా పన్నులు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ వర్తింస్తుందని స్పష్టం చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఎర్లీబర్డ్ పథకానికి ఈ నెల 7వరకు గడువు పొడిగించారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– బాలాజీ, కమిషనర్, కొత్తూరు మున్సిపాలిటీ

ఎక్సైజ్ శాఖకు అవినీతి మరక

- సహచర ఉద్యోగినీ వదలని వైనం
- జిల్లా కార్యాలయంలోనే చేతివాటం
- నెలనెలా మామూళ్లు ఇవ్వాల్సిందే
- గుడ్‌విల్ పేరుతో ఉన్నతాధికారుల వరకు..
- ఏసీబీ దాడులతో అసలు విషయం వెలుగులోకి..



వికారాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం

వికారాబాద్: ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడటం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. బెల్టు దుకాణాలు, మద్యం షాపులు, బార్లు, రెస్టారెంట్ల నుంచి ముక్కు పిండి మామూళ్లు వసూలు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే సొంత శాఖ, సహచర ఉద్యోగులను కూడా వదిలిపెట్టరని తాజా ఘటనతో రుజువైంది. శుక్రవారం ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ పట్టుబడిన విషయం తెలిసిందే. కింది‌స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతిలో భాగస్వాములు అవుతున్నారనే చర్చ జరుగుతోంది.

ఎవరి వాటా వారికి..

జిల్లా ఎక్సైజ్ శాఖలో వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. వసూలు చేసిన మొత్తంలో ఎవరి వాటాలు వారికి వెళ్లి పోతాయనేది బహిరంగ రహస్యం. విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ టీంలు సైతం జిల్లా బాస్ కనుసన్నల్లోనే దాడులు, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తాయనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక్కో క్వార్టర్ బాటిల్ నుంచి ఫుల్ బాటిల్, బీర్ల అమ్మకాల్లో రూ.10 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎప్పుడైనా బెల్టు షాపుల నిర్వాహకులు పట్టుబడితే వారికి మద్యం దుకాణ యజమానులు అండగా నిలుస్తున్నారు. కేసులు కాకుండా చూస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నందునే బెల్టు షాపుల విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో మద్యం షాపు నుంచి వేల రూపాయలు మామూళ్ల రూపంలో అందుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల పేరుతో అప్పుడప్పుడు అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు గాలికి..

దుకాణాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనేక నిబంధనలు రూపొందించినా అవి ఎక్కడా అమలు కావడం లేదు. ఉదాహరణకు పూడూరు మండలం మన్నెగూడ సమీపంలోని ఎన్కెపల్లిగేట్ వద్ద ఆలయానికి 50 మీటర్ల దూరంలోనే మద్యం షాపు ఏర్పాటు చేశారు. వికారాబాద్ ఎస్పీ కార్యాలయం వద్ద బాలికల పాఠశాల ఉన్నా ఇక్కడ కూడా మ ద్యం షాపు ఏర్పాటు చేశారు. దీనిపై కాలనీ వా సులు ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. మద్యం దుకాణాల వద్ద పార్కింగ్ స్థలాలు ఉండాలి.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదు.

వ్యాపారాన్ని బట్టి..

జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాలు ఉన్నాయి. రోజుకు రూ.60 వేలకు మించి వ్యాపారం జరిగే షాపు నుంచి నెలనెలా రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇవి నెలనెలా తీసుకునే మామూళ్లకు అదనం అని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే భవిష్యత్‌లో తమకు ఇబ్బందులు ఎదురవుతాయని మద్యం దుకాణ యజమానులు భయపడుతున్నట్లు సమాచారం. ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్లు తీసుకుంటున్న కారణంగానే గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎక్సైజ్ శాఖలో అవినీతి జలగలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ రావు బాధ్యతలు స్వీకరించడంతో శనివారం పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రధాన కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేదిశగా ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని కోరారు.

బీడీ, డాగ్‌స్క్వాడ్ బృందాల తనిఖీ


వికారాబాద్ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న డాగ్‌స్క్వాడ్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో శనివారం బీడీ టీం, డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీ చేపట్టారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు.

ఎల్మకన్నెలో వ్యక్తి అదృశ్యం

పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య


రవి (ఫైల్)

తాండూరు రూరల్: పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్మకన్నె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామానికి చెందిన సిరిగిరిపేట్ రవి, స్వాతి దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే రవి గత నెల 13వ తేదీన ఎల్మకన్నెలోని ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య స్వాతి శనివారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో భర్త రవి కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలిరంగు ప్యాంట్, గులాబిరంగు షర్ట్ ధరించినట్లు తెలిపింది.

బొలెరో వాహనం బైకు ఢీ

యువకుడి మృతి


శుభాష్ (ఫైల్)

మోమిన్‌పేట: బొలెరో వాహనం.. బైకు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి గ్రామానికి చెందిన మొల్లని శుభాష్(30) శుక్రవారం రాత్రి బూరుగుపల్లి నుంచి తన బైకుపై స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో కల్లు సరఫరా చేసే బొలెరో వాహనం వేగంగా వచ్చి రాళ్లగుడుపల్లి నుంచి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. బైకు నుజ్జు నుజ్జయి తలకు బలమైన గాయం అవ్వడంతో శుభాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మృతుని తండ్రి మొల్లని నర్సయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవరు తుకరాంను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ అరవింద్ పేర్కొన్నారు.

‘పట్టా’లేని పాట్లు!


సొంతంగా కొనుగోలు చేసిన టార్పలిన్లను కప్పినరైతులు

సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీకి సర్కారు మంగళం
- 2018 నుంచి నిలిపివేత
- బహిరంగ మార్కెట్లో అధిక ధరలు
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

దౌల్తాబాద్: ఆరుగాలం శ్రమించి పండించి, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజులుగా వరుణుడు నిత్యం వీరిని భయపెడుతున్నాడు. ఏదో ఒక చోట కురుస్తున్న వానతో ధాన్యం ఆరబోసిన రైతుల పాట్లు అన్నీఇన్నీ కావు. ఎండిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు కనీసం టార్పాలిన్లు (పట్టాలు) కూడా అందుబాటులో లేవు. ప్రభుత్వం ఏడేళ్లుగా వీటి సరఫరాను నిలిపేసింది. దీనికి తోడు బహిరంగ మార్కెట్లో టార్పాలిన్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అంత ఖరీదు చేసి కొనలేకపోతున్న కర్షకులు ఎరువుల బస్తాలతో పట్టాలు కుట్టించి, ధాన్యం తడవకుండా కాపాడుకుంటున్నారు. మరికొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపులు..

మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 12 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే ఎనభైశాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు కొనుగోలు సెంటర్లకు తరలిస్తున్నారు. ఈ సమయంలో వడ్లు ఆరబెట్టేందుకు, వర్షం పడితే తడవకుండా కప్పేందుకు టార్పాలిన్లు చాలా అవసరం. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేసింది. వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు పోటీపడేవారు. డిమాండ్ మేర కాకపోయినా.. ఉన్నంతలో ఇచ్చేవారు. కానీ ఏడేళ్లుగా ప్రభుత్వం రాయితీ టార్పాలిన్ల పంపిణీని ఆపేసింది.

బహిరంగ మార్కెట్లో అధికం

ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే టార్పాలిన్లు నాణ్యతతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. వీటికి 50శాతం రాయితీని వర్తిస్తుంది. ఒక్కో టార్పాలిన్‌కు రైతు తనవంతుగా వాటా రూ.1,250 చెల్లిస్తే చాలు. అదే ప్రైవేటులో కొనుగోలు చేస్తే ఒక్కో కవర్‌కు రూ.3 వేలు పలుకుతుంది. నాణ్యత కూడా అంతగా ఉండదు.

రూ.3 వేలు అంటున్నారు



ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చింది. పంట కోస్తే ధాన్యం ఆరబెట్టడానికి టార్పాలిన్లు లేవు. ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వలేదు. బయట మార్కెట్లో రూ.2,500 నుంచి రూ.3 వేలు అంటున్నారు. – కృష్ణ, రైతు దౌల్తాబాద్

ఆదేశాలు రాలేదు

చాలా మంది రైతులు సబ్సిడీ టార్పాలిన్లు కావాలని అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

కొనసాగుతున్న ఉచిత కరాటే శిబిరం

ఆసక్తి చూపిస్తున్న విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మేరినాట్స్ గ్రౌండ్‌లో సమ్మర్ ఫ్రీ కరాటే శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ తరగతులు మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్‌ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉదయం 6గంటల నుంచి 8వరకు రెండు గంటలు నిర్వహిస్తున్నారు. గత నెల 26న ప్రారంభమైన ఈ శిబిరం మే 26 వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు యండీ ఖాజాపాషా మాస్టర్ తెలిపారు. ఆయన సమ్మర్ ఉచిత శిక్షణ శిబిరాలు 15సంవత్సరాలనుంచి చేపడుతున్నట్లు తెలిపారు. తన శిష్య బృందంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న శిబిరంలో 215మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారన్నారు. ఈ క్యాంపులో శిక్షణ పొందే వారు అమ్మాయిలే అధికంగా ఉన్నారు. శిక్షణ శిబిరంలో కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్, ఓరియల్ వెపన్, జిమ్నాస్టిక్, జూడో తదితర వాటిలో తర్ఫీదు ఇస్తున్నామని శిక్షకులు తెలిపారు. అనంతరం ఆసక్తి, ప్రతిభ గల విద్యార్థులను రాష్ట్ర, జాతీయ పోటీలకు సైతం శిక్షణ ఇచ్చి పోటీలకు సన్నద్ధం చేస్తామని చెబుతున్నారు. నిర్వాహకుడు మాస్టర్ యండీ ఖాజాపాషాతో పాటు అతని బృందం బ్లాక్ బెల్ట్ హోల్డర్స్ డి. విజయ్, మాణిక్‌నాయక్, మధు మోహన్, ప్రజ్వల్‌కుమార్ తదితరుల ఆధ్వర్యంలో క్యాంపు కొనసాగిస్తున్నారు. కరాటేతో విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని, ఉచితంగా శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని మాస్టర్ ఖాజాపాషాను తల్లిదండ్రులు, విద్యార్థులు, క్రీడాభిమానులు అభినందిస్తున్నారు.


మేరినాట్స్ గ్రౌండ్‌లో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

వరిధాన్యం సేకరణకు చర్యలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

అనంతగిరి: జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం సేకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. శనివారం వరి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంట వర్షాలతో తడిసిపోకుండా కావలసిన తాడిపత్రీలు, సంచులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తూనిక, తేమ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు చేరవేయాలని ఆయన పేర్కొన్నారు. ధాన్యాన్ని సేకరించేందుకు హమాలీలను తగిన సంఖ్యలో పెంచుకోవాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, మార్కెటింగ్ ఏడి సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ఏఐతో విద్యా ప్రమాణాలు మెరుగు

- సీఎంఓ రజిని, జీసీడీఓ శ్రీదేవి
- కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రజిని, జీసీడీఓ శ్రీదేవి
- బొంపల్లిలో విద్యార్థులు నేర్చుకుంటున్న ఏఐ విద్య పరిశీలన


బొంపల్లిలో కంప్యూటర్ బోధనను పరిశీలిస్తున్న సీఎంఓ రజిని, జీసీడీఓ శ్రీదేవి

దోమ: విద్యార్థుల ప్రమాణాలు పెంపునకు కృత్రిమ మేధ(ఏఐ) విద్య ఎంతో దోహదపడుతుందని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి(సీఎంఓ) రజిని, జీసీడీఓ(గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న వేసవి తరగతులను శనివారం ఎంఈఓ వెంకట్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కంప్యూటర్ ద్వారా విద్యార్థులు అందిపుచ్చుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. చదవడం, రాయడం, సంఖ్యాపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిగతంగా విద్యార్థుల ప్రమాణాలు, అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చడం వంటివి దగ్గరుండి పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమయంలో ఎలాంటి అనుమానాలు అడిగినా వెంటనే నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటయ్య, వలంటీర్ అఖిల్, అభిలాష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ‘ఆర్ట్’ చేయూత


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు తమ సంస్థ పనిచేస్తోందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొల్లూరులో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆమె, రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిత్యం కొంత సమయాన్ని వాకింగ్, ధ్యానం, యోగాకు కేటాయించాలన్నారు. ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన సుమారు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, నాయకులు బాల్‌రాజ్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు విజయ్‌దేవరకొండపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు విజయ్ దేవరకొండపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలునాయక్ శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓ సినిమా రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై తమ సంఘం తరఫున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం


శ్రీకాంత్ యాదవ్(ఫైల్)

ఆమనగల్లు: మండల పరిధిలోని కోనాపూర్‌గేటు సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో అమెజాన్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి శ్రీకాంత్(25) ఆరేళ్లుగా తుక్కుగూడ సమీపంలో ఉన్న అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరైన ఆయన తన బైక్‌పై శనివారం ఇంటికి వస్తున్న క్రమంలో సుమారు ఉదయం 3గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాద కారణాలు తెలియరాలేదు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం మృతుడి కుటుంబీకులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పరామర్శించారు.

ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి భారీ విరాళం

రూ.15 లక్షల చెక్కు అందజేసిన కేసర్ ఇండస్ట్రీస్


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చెక్కును అందజేసిన వ్యాపారవేత్త

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కేసర్ ఇండస్ట్రీస్ అధినేత బంకట్ లాల్‌బాటీ శనివారం భారీ విరాళం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసిన రూ.15 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరిందని.. దాతల సహకారంతో అత్యాధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువులకు దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో గర్భిణి మృతి


ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీకులు


మృతి చెందిన గర్భిణి సుమిత్రాబాయి (ఫైల్)

- వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ
- ఆక్సిజన్ అందక చనిపోయిందన్న సూపరింటెండెంట్

తాండూరు టౌన్: అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన ఎనిమిది నెలల గర్భిణి చికిత్స పొందుతూ మృతి చెందింది. తాండూరు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యమే గర్భిణితో పాటు ఆమె కడుపులోని బిడ్డ ప్రాణాలను తీసుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దేముల్ మండలం పాషాపూర్‌తండాకు చెందిన సుమిత్రాబాయి (35)కి కడుపులో నొప్పి రావడంతో శనివారం ఉదయం 6గంటలకు ఎంసీహెచ్‌లో చేరింది. గంటన్నర గడిచిన తర్వాత గర్భిణితో పాటు కడుపులోని శిశువు మృతిచెందిందని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తాము ఉదయం 6 గంటలకు ఆస్పత్రికి రాగా, 7.30 గంటల వరకు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య మృతిచెందిందని జైసింగ్ ఆరోపించాడు. ఈక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అత్యవసర చికిత్స అందించాల్సిన సమయంలో సిబ్బంది, డాక్టర్లు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్‌ను వివరణ కోరగా సుమిత్రాబాయికి రక్తం తక్కువగా ఉందని, హిమోగ్లోబిన్ శాతం 1.8 గ్రాములు మాత్రమే ఉందని, దీంతో శ్వాస తీసుకోకలేకపోయిందని తెలిపారు. సరిపడా ఆక్సిజన్ అందకపోవడంతో సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయిందని స్పష్టంచేశారు. ఇందులో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట


రోదిస్తున్న బంధువులు


శాంతుకుమార్ (ఫైల్)

- చెరువులో మునిగి గిరిజనుడి మృతి
- మైసమ్మతండాలో విషాదం

తాండూరు రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ గిరిజనుడు చెరువులో మునిగి చనిపోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని మైసమ్మతండాలో శనివారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్ శాంతుకుమార్(28), లక్ష్మీబాయి దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. శాంతుకుమార్ మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్తుంది. శుక్రవారం పెద్దేముల్ మండలం పాషాపూర్‌లో జరిగిన ఓ విందులో పాల్గొని ఇంటికి వచ్చిన శాంతు సాయంత్రం 6గంటల ప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తండా మొత్తం వెతికారు. శనివారం ఉదయం గుండ్లమడుగుతండాకు చెందిన జయరాంచౌహాన్‌కు తండా సమీపంలోని ఐలాన్‌చెరువు వద్ద శాంతు బైక్, దుస్తులు, చెప్పులు కనిపించాయి. వెంటనే అతను ఈ విషయాన్ని మైసమ్మ తండా వాసులకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు వచ్చి చెరువులో గాలించగా శాంతు మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. శాంతుకుమార్ మృతితో భార్య, పిల్లలు గుండెలు పగిలేలా రోదించారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ శనివారం అందజేశారు. మండలంలోని నర్కూడ వాసి పి.పద్మ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె వైద్య సహాయం కోసం ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నీరటి రాజు, ఎస్.శ్రీనివాస్, శేఖర్, విశ్వనాథం, ప్రభు, నర్సింహా, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో ‘దోస్త్’సెంటర్

- డిగ్రీ కాలేజీలో ప్రారంభించిన ప్రిన్సిపల్ లక్ష్మణ్
- కొత్త కోర్సుల కరపత్రాల ఆవిష్కరణ


దోస్త్ సహాయక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్

తాండూరు టౌన్: ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) జిల్లా స్థాయి సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మణ్ తెలిపారు. శనివారం ఆయన సెంటర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ సెంటర్‌లో సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కళాశాల పనివేళల్లో ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. పేర్ల నమోదు, ఆధార్ ధ్రువీకరణ, వెబ్ ఆప్షన్స్ నమోదు తదితర సేవలు పొందవచ్చన్నారు. వివరాల కోసం దోస్త్ సమన్వయకర్తలు ఎస్.మహేందర్‌రెడ్డి, కిషన్, అమర్‌ను 9885583432, 9959531273, 9849432029 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షరీఫా, హరికృష్ణ, రవి, ఆశప్ప, అనంతరామ్ పాల్గొన్నారు.

మరిన్ని కొత్త కోర్సులు..

ఈ ఏడాది తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. వీటికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. బీఎస్సీ (ఫిజికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఏ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం), బీఏ (సోషియాలజీ, ఆంథ్రోపాలజీ, సైకాలజీ, జియోగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) వంటి కోర్సులను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. వీటితో పాటు హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం, నాలుగు అధునాతన డిజిటల్ తరగతుల సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

పోలీసునని చెప్పి..ఐపీఎల్ టికెట్లు లాక్కొని పరార్

సనత్‌నగర్: పోలీసునని చెప్పి బెదిరించి యువకుల నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ టికెట్లను లాక్కొని పరారైన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన వంగూరి రాకేష్ ఈ నెల 5వ తేదీన నగరంలో జరిగే ఎస్‌ఆర్‌హెచ్, డీసీ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ వీక్షించడం కోసం 16 టికెట్లను కొనుగోలు చేసేందుకు స్నేహితులైన పవన్, రామకృష్ణలతో కలిసి నగరానికి వచ్చాడు. మొదట హిమాయత్‌నగర్‌లోని టికెట్ బుకింగ్ కేంద్రానికి వెళ్లి 16 టికెట్ల కోసం ప్రయత్నించగా 8 టికెట్లు మాత్రమే దొరికాయి. మరో 8 టికెట్ల కోసం జింఖానా మైదానానికి చేరుకుని అక్కడ కష్టపడి మరో 8 టికెట్లను కొనుగోలు చేసి బయటకు వస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అడ్డగించాడు. తనకు నాలుగు టికెట్లు విక్రయించాలని, రూ.2,500ల చొప్పున విలువ చేసే టికెట్లకు రూ.5,000 చొప్పున చెల్లిస్తానన్నాడు. తొలుత నిరాకరించిన యువకులు ఆ తర్వాత టికెట్లను విక్రయించేందుకు ఒప్పుకున్నారు. మళ్లీ సదరు వ్యక్తి మరో 6 టికెట్లు కావాలని అడిగాడు. టికెట్లు ఇచ్చేందుకు యువకులు నిరాకరించడంతో వారిని బెదిరించాడు. వారికి పోలీసు గుర్తింపు కార్డు చూపించి తాను టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారినని, బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్నారని, అందరినీ జైలుకు పంపుతానని బెదిరించి వారిని బేగంపేట పోలీస్‌స్టేషన్ సమీపం వరకు తీసుకువచ్చాడు. మొత్తం 16 టికెట్లతో పాటు యువకుల వద్ద ఉన్న రూ.1700 తీసుకుని వారిని తిరిగి పరేడ్‌గ్రౌండ్ వద్ద దించి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తిపై అనుమానం వచ్చిన యువకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.